క్లుప్తంగా

పోలీసుల ఆయుధ పూజ



ఆయుధ పూజ చేస్తున్న అడిషనల్ ఎస్పీ భీమారావు దంపతులు

భీమవరం: విజయదశమి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయుధ పూజ నిర్వహించారు. పోలీసు ఆయుధాగారం , పోలీసు వాహనాల విభాగాల్లో దుర్గామాత చిత్రపటం, ప్రతిమలకు అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఆయుధ పూజలో భాగంగా పోలీసుల ఆయుధాగారంలోని పోలీసు అధికారులు, సిబ్బంది దైనందిన విధుల్లో వినియోగించే ఆయుధాలకు, వివిధ రకాల అత్యాధునికమైన ఆయుధాలకు, పోలీసు విభాగంలోని వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన

భీమవరం: మండలంలోని చినఅమిరంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఆలమ్)కు భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ భీమవరంలోని చిన అమిరంలో మరింత స్వచ్ఛమైన తాగునీరును అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ సర్పంచ్ బుద్దరాజు శ్రీనివాసరాజు, గొట్టుముక్కల రామసీత, కోమటి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీసీతారామ స్వామి దేవస్థానం నందు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ నున్న అరుణశ్రీ పాల్గొని జ్ఞానబోధ చేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వర్తమానంలో జీవించడం అలవాటు చేసుకోవాలని దానికి శ్వాస మీద ధ్యాస ధ్యాన సాధన బాగా తోడ్పడుతుందని, కర్మ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకొని వర్తమానంలో మంచి కర్మలు చేస్తూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేడిశెట్టి ర్రుష్ణారావు, ముఖేష్, వద్రి విశ్వేశ్వరరావు టి.నాగరాజు బి.శ్రీదేవి, వద్రి కృష్ణవేణి, బి.యర్రాయమ్మ,ఆదిరెడ్డి గోపమ్మ,సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు ఘన నివాళి

భీమవరం: నీతి నిజాయితీ, విలువలకు నిలువెత్తు నిదర్శనం రతన్ టాటా అని, ఆయన మరణం ప్రపంచానికే తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. భీమవరంలో శ్రీ విజ్ఞాన వేదిక, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం రతన్ టాటా సంతాప సభ నిర్వహించారు. ముందుగా రతన్ టాటా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, అరేటి ప్రకాష్, చినిమిల్లి వెంకట్రాయుడు, వబిలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచం ఒక విలువైన రత్నాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ఉండపల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నందమూరి రాజేష్, కారుమూరి చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

భీమవరం: టూటౌన్ పరిధిలోని ఓ భవనంలో జూదం ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేశామని సీఐ కాళీచరణ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.37,150 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని తెలిపారు.

నత్తనడకన ఆర్వోబీ పనులు

- ఉండికి శాపంలా మారిన వైనం
- త్వరగా పూర్తి చేయాలని స్థానికుల వేడుకోలు



ఉండి ఆర్వోబీ వద్ద జాతీయ రహదారిపై దిగబడిపోయిన లోడు లారీ



ఆర్వోబీ వద్ద గోతులమయమైన జాతీయ రహదారి

ఉండి: జాతీయ రహదారి 165పై ఉండి రైల్వే గేటు వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జ్) ఉండికి శాపంలా మారింది. ఈ నెల 16వ తేదీకి సుమారు నాలుగేళ్లు పూర్తవుతున్నాయి. 2020 అక్టోబర్ 16న నాటి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ వర్చువల్ విధానంలో శంఖుస్థాపన చేశారు. ఆ నాటి నుంచి అనేక ఆవరోధాలు ఆర్వోబీ నిర్మాణానికి అడ్డుగా మారాయి. ఆర్వోబీ నిర్మాణం వలన రహదారి పూర్తిగా పాడవడంతో రహదారి పెద్ద పెద్ద గోతులుగా మారిపోయింది. వర్షం వస్తే చాలు ఈ రహదారిపై ప్రయాణం చేయడానికి వాహనదారులు భయపడిపోతున్నారు. జాతీయ రహదారి కావడంతో ఎన్నో భారీ వాహనాలు ఈ రహదారిలో ప్రయాణిస్తున్నాయి. అయితే కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారి మరింత అధ్వానంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో పడి భారీ వాహనాలు పాడైపోతున్నాయి. ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడంతో వాహనదారులు ప్రతీ రోజు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతే కాకుండా వాహనాలు ఎక్కడికక్కడ చెడిపోవడంతో ఈ ప్రాంతానికి వచ్చే సరికి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. సుమారు 1.35 కిలోమీటర్ల పొడవునా రూ.90.99 కోట్లతో నిర్మించ తలపెట్టిన ఆర్వోబీ అసంపూర్తిగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతోపాటుగా కైకలూరు మండలం ఆలపాడు వద్ద నిర్మాణం ప్రారంభించిన ఆర్వోబీ గతేడాది పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అయితే ఉండిలో మాత్రం పలువురు కాంట్రాక్టర్లు మారినా గాని నిర్మాణానికి నోచుకోలేదు. అక్కడక్కడా కొంతమేర పూర్తయిన నిర్మాణాలపై అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్రంగా తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తి నిర్మాణంతో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల వలన బురద ఇళ్లల్లోకి వస్తున్నట్లుగా స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇకనైనా అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి సరైన చర్యలు తీసుకోకపోతే మరిన్ని ఇబ్బందులు తప్పవని వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు.

ఇంత నిర్లక్ష్యం దేనికి ?



పక్క జిల్లాలో అంతగా ట్రాఫిక్ లేని ప్రాంతంలో నిర్మాణాన్ని గత ఏడాదే పూర్తి చేశారు. కానీ ఉండిలో ఆర్వోబీ నిర్మాణంపై ఇంత నిర్లక్ష్యం ఎందుకు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోరా.? ఇదంతా ప్రయాణికులు, వాహనదారుల ఖర్మలా ఉంది. ప్రజలకు ప్రమాదకరంగా మారిన ఆర్వోబీపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉండటం తగదు.

బండెల జార్జ్‌రాజు,వాహనదారుడు, చెరుకువాడ

కనీసం రోడ్డు నిర్మాణం చేయండి



ఆర్వోబీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో నిర్మాణ సమయంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. నిర్మాణం పూర్తి చేయకపోయినా కనీసం రోడ్డు అయినా బాగు చేసి నిర్మాణం చేస్తే సమస్య ఉండదు. అలాగే ఆర్వోబీ నాణ్యతపైనా అనుమానాలున్నాయి. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే గోడలు బీటలు వారాయి.అధికారులు గమనించాలి.

శేషాద్రి శ్రీనివాస్, స్థానికుడు, ఉండి

మావుళ్లమ్మకు వెండి సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మకు ఆదివారం భీమవరానికి చెందిన గుండు నాగ వెంకట కృష్ణావతారం 250 గ్రాముల వెండి సమర్పించారు. అలాగే తెలంగాణ కల్వకుర్తికి చెందిన కవితా ఆనంద్ 303 గ్రాముల వెండి కానుకగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మీ నగేష్, దాతల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే సత్యప్రభ

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారిని ఆదివారం పత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దర్శించుకున్నారు. ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ఆమెకు ప్రసాదాలు, శేషవస్త్రం, అమ్మవారి ఫోటో అందజేశారు.

రొయ్యల వ్యాపారి టోకరా కలకలం

భీమవరం: స్థానిక రొయ్యల వ్యాపారి టోకరా వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారిది. పెద్ద మొత్తంలో టోకరా వేసిన వ్యాపారి టీడీపీ నాయకుడు కావడంతో వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా చక్క బెట్టడానికి కొంతమంది టీడీపీ, జనసేన నాయకులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. కొంత కాలం పాటు ఒక రొయ్యల కంపెనీలో పని చేసిన వ్యక్తి తరువాత టీడీపీ, జనసేన నాయకుల అండతో సొంతంగా రొయ్యల కొనుగోలు వ్యాపారం ప్రారంభించాడు. కొంత కాలం రైతులకు సక్రమంగా సొమ్ములు చెల్లించడంతో అతనిపై అందరిలోనూ నమ్మకం ఏర్పడింది. దీనిని అదునుగా తీసుకొని ప్రాన్ బ్రోకర్స్ వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేసి వారికి నమ్మకం కలిగించడానికి పేరొందిన రొయ్యల కంపెనీకి రొయ్యలు విక్రయించినట్లు నకిలీ రశీదులు సృష్టించి, ప్రాన్ బ్రోకర్స్, రైతులకు చూపించడంతో పూర్తిగా నమ్మకం ఏర్పడి వారు పెద్ద మొత్తంలో అప్పులు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ విధంగా సుమారు 50 మంది నుంచి రూ.14 కోట్లకు పైగా అప్పు తీసుకున్నట్లు చెబుతున్నా ఇంకా పెద్ద మొత్తం ఉంటుందని అంచనా వేస్తున్నారు. టోకరా వేసిన వ్యక్తి వెనుక టీడీపీ, జనసేన నాయకులున్నట్లు తెలియడంతో ఏమి చేయాలో తెలియని సంకట పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా పేరొందిన కంపెనీ నకిలీ రశీదులు వినియోగించడంతో కంపెనీ ప్రతినిధి తమకు టోకరా వేసిన వ్యక్తికి ఎటువంటి సంబంధం లేదని తమ రశీదులను అక్రమంగా వినియోగించారంటూ ముందుస్తు జాగ్రత్తగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. అయితే పోలీసులకు ఫిర్యాదు విషయం బయటపడకుండా టోకరా వేసిన వ్యక్తి వ్యవహారం సర్దుబాటు చేసుకుంటే ఎటువంటి కేసు పెట్టొద్దని, ప్రాన్‌బ్రోకర్స్, రైతులకు ఇవ్వాల్సిన సొమ్ములు ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెడితే కేసు నమోదు చేయొచ్చని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడవకుండానే టీడీపీ నాయకులపై పలు ఆరోపణలు రావడంతో జనసేన క్యాడర్ మండిపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒక టీడీపీ నాయకుడు మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమంగా భవనం నిర్మిస్తుంటే తాజాగా రొయ్యల వ్యాపారి గొడవ టీడీపీ పైనే కాకుండా జనసేన, బీజేపీపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని క్యాడర్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజరాజేశ్వరీ దేవిగా దుర్గమ్మ

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రులలో పదో రోజు మావుళ్లమ్మను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ దసరా ప్రత్యేక పూజ, లక్ష కుంకమార్చన, చండీ హోమం నిర్వహించారు. అమ్మవారి లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

నాచువారి సెంటర్‌లో

స్థానిక నాచువారి సెంటర్‌లో కనదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి మహోత్సవాల్లో పదో రోజు అమ్మవారిని విజయదుర్గగా అలంకరించారు. గునుపూడి గ్రామదేవత శ్రీఆదిలక్ష్మి, భీమేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీమహిషాసురమర్దని, పంచారామక్షేత్రం శ్రీపార్వతీదేవి అమ్మవార్లకు దసరా మహోత్సవాల్లో అఖరి రోజు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సహస్ర అష్టోత్తర నామ పూజ

శ్రీ వాసవీ మాత అమ్మవారి దసరా మహోత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య యువజన సంఘం వారి ఆధ్వర్యంలో ఆదివారం 108 మంది మహిళలచే లక్ష పసుపు కొమ్ములతో సహస్ర అష్టోత్తర నామాల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

భీమవరం 15వ వార్డులోని శ్రీకనకదుర్గ అమ్మవారి 4వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పురోహితులు వారణాసి మారుతీ శర్మ, దేరం సుబ్రహ్మణ్య శర్మలచే అమ్మవారికి ప్రత్యేక పూజలు మహా నివేదన చేశారు.



భీమవరం(ప్రకాశం చౌక్): విజయదుర్గాదేవిగా కనకదుర్గమ్మ



కాళ్ల: విజయలక్ష్మి అలంకరణలో అమ్మవారు



వీరవాసరం: పూజలు అందుకుంటున్న అమ్మవారు



ఆకివీడు: అమ్మవారి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు



ఉండి: చిలుకూరులో పైడమ్మకు శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

వైభవోపేతంగా అమ్మవార్ల ఊరేగింపు

ఆకివీడు: అమ్మల గన్న అమ్మ ముగ్గురమ్మల మూల పుటమ్మ కనకదుర్గమ్మ వారి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో అమ్మవార్ల విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఆదివారం భారీ ఊరేగింపులు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద, ప్రత్యేక మండపాల వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను ఊరేగింపుగా తరలించారు. భజా భజంత్రీలు, బాణసంచా, డప్పులు, గరగ నృత్యాలతో, శక్తి వేషాలతో అమ్మవార్ల ఊరేగింపులు వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం వెంకయ్య వయ్యేరులో నిమజ్జనం చేశారు.

ఘనంగా పైడమ్మ శోభాయాత్ర

ఉండి: దసరా వేడుకల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల వ్యాప్తంగా కనకదుర్గమ్మ విగ్రహాల ఊరేగింపు, శోభాయాత్రలను నిర్వహించారు. దీంట్లో భాగంగా మండలంలోని చిలుకూరులో పైడమ్మ అమ్మవారి శోభాయాత్ర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గ్రామ సరిహద్దుల వరకు శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

వీరవాసరం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వీరవాసరం మండలంలో ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు, ఉద్వాసన కార్యక్రమాలు చేపట్టారు. వీరవాసరంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం , తోలేరులోని శ్రీ ప్రసన్న కనకదుర్గాదేవి ఆలయం రాయకుదురు, మడుగు పోలవరం, నవుదూరు, అండలూరు, తోకలపూడి, మత్స్యపురి, నందమూరి గరువు, చింతల కోటి గరువు, పెరికిపాలెం, దూసనపూడి, మత్స్యపురి పాలెం తదితర గ్రామాల్లో శ్రీ అమ్మవార్ల నవరాత్రి మహోత్సవాలు వేడుకగా నిర్వహించారు.

విజయలక్ష్మి అలంకరణలో

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీ లక్ష్మీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీ విజయలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అలంకరణ దాతలచే సామూహిక సహస్ర నామ కుంకుమ పూజా కార్యక్రమం నీరాజనం మంత్ర పుష్పాలు తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

మండల స్థాయి పోస్టులు ఖాళీ

ఆకివీడు: మండలంలోని పలు ప్రధాన శాఖల మండల స్థాయి పోస్టుల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇటీవల ఆయా శాఖల అధికారులు బదిలీపై వెళ్లడంతో ఖాళీలను భర్తీ చేయలేదు. దీంతో ఆ శాఖల పనితీరుపై ప్రజలు అయోమయంలో పడ్డారు. మండలంలోని పంచాయతీరాజ్ ఏఈ, గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ, ఇరిగేషన్ ఏఈ డ్రెయినేజీ జేఈ-1,-2, పెదకాపవరం, చినకాపవరం, దుంపగడప, గుమ్ములూరు, సిద్ధాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డీడీవో బదిలీ అయ్యారు. వారి స్థానంలో నేటికీ బదిలీ అయిన వారు జాయిన్ అవ్వలేదు. హౌసింగ్ ఏఈ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సచివాలయ ఇంజనీర్ అదనపు బాధ్యతలతో పని చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయా శాఖల ముఖ్య అధికారుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

ఎలక్ట్రిక్ బైక్‌ల షోరూం ప్రారంభం

కాళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎలక్ట్రికల్ బైక్‌లను ప్రోత్సహించడం అభినందనీయమని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. విజయదశమి సందర్భంగా మండల కేంద్రమైన కాళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన వేణు ఎలక్ట్రిక్ బైక్‌ల షోరూంను ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు ప్రారంభించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు కృషి చేయాలి

కాళ్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుకు కృషి చేయాలని టీడీపీ నేతలు సూచించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.రామరాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో 2021 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని అర్హత ఉన్న అందరినీ ఓటరుగా నమోదయ్యేలా చూడాలని ఈ సందర్భంగా నేతలు చెప్పారు.

పట్టుదలే భవిష్యత్‌కు పునాది

ఉండి: యువత పట్టుదలతో అనుకున్నది సాధిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందని పాస్టర్ చిన్న సవరపు అన్నారు. ఆదివారం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్‌లో వందలాదిగా క్రైస్తవులు పాల్గొనగా యూత్ సండే కార్యక్రమాన్ని చర్చ్‌యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఆర్ పీ కరుణాకర్ ఆధ్వర్యంలో జరిగిన యూత్ సండే కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని కీర్తనలు ఆలపించి, ఆరాధనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

భీమవరం: వరద బాధితులకు దాతలందిస్తున్న సహకారం ప్రశంసనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వరద బాధితులకు భీమవరం బార్ అసోసియేషన్ రూ 1,11,111 సహాయాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, వైస్ ప్రెసిడెంట్ కె.వెంకటరావు, జనరల్ సెక్రటరీ అడపాల ప్రసన్న కుమార్, కోశాధికారి సీహెచ్ పరలరావు, జాయింట్ సెక్రటరీ జె.సత్యనారాయణ, కె.భాగ్యలక్ష్మి, కె.ప్రతాప్, ఎం.మల్లేష్, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి దోహదం చేయాలి

ఉండి: త్యాగానికి, దేవుడి ప్రేమను ప్రపంచానికి చాటే ప్రతి రూపంగా ఉంటూ, సమాజాభివృద్ధికి పాస్టర్లు దోహదం చేయాలని రెవరెండ్ డాక్టర్ ఎస్.జార్జ్‌ముల్లర్ అన్నారు. ఆదివారం పాస్టర్స్ అప్రిషియేషన్ డేను పురస్కరించుకుని మండలంలోని చెరుకువాడ పెదపేట సీబీసీఎస్‌సీ చర్చ్‌లో పాస్టర్ జార్జ్‌ముల్లర్, సిస్టర్ మేరీ శాంతకుమారిని స్థానిక స్త్రీల సమాజ సభ్యులు సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో చెరుకువాడ పెదపేట సంఘ సీఆర్ ఎం ఫిలిఫ్,స్త్రీల సమాజం,సంఘస్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

పాలకోడేరు: ఉండి నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతానని ఎమ్మెల్యే కనుమూరి దరఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం, ఆదివారం రెండు రోజులు పాలకోడేరు మండలంలోని పలు గ్రామాల్లో కోట్ల రూపాయలతో సంబంధించిన అభివృద్ధి పథకాలకు ఆయన శంకు స్థాపనలు చేశారు. శనివారం ముందుగా పెన్నాడలోని కునుకు వారి వీధి రామాలయం వద్ద దసరా మహోత్సవాలు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆరంభించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో హై స్కూల్ వద్ద, గోరగనమూడి లో రజకుల వీధి, కొత్త వీధి,పెన్నాడ అగ్రహారంలో దండమ్మ గుడి వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు,మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అమలు చేయాలి



తోకతిప్పలో ఇచిత ఇసుక కోసం నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం: ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని తోకతిప్పలో ఆదివారం పీఎం ఆధ్వర్యంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి భావన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశారన్నారని అయితే అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచిపోతున్నా ఉచిత ఇసుక పాలసీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు బర్రె రమేష్, మోక మీరా సాహెబ్, సీపీఎం నాయకులు బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరావు, సూర్యనారాయణ, పొన్నమండ నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.